# సంధ్యారాగం

అయిదున్నరకల్లా లేపేస్తున్నాడు పాలవాడు.

ఎనిమిది గంటల్లోపుగా ఎవరూ నాకు నిద్రాభంగం కలిగించడాన్ని సహించన్నేను. అది నా యిష్టం. నా హక్కు!

ఈ ప్రజాస్వామ్యంలో నాకు స్వేచ్ఛ ఉంది. అంటే నాకు తోచినట్టు ప్రవ ర్తించవచ్చన్నమాట. నా యిష్టం వొచ్చినట్టుండవచ్చు. అంచేత నా స్వేచ్ఛ నెవరూ అరికట్టడానికి వీల్లేదు. ఈ పాలవాడు సగానికి సగం నీళ్ళు కలిపేస్తున్నాడు. కాఫీకి, మజ్జిక్కి రుచి పచి లేకుండా పోతోంది.

నీళ్ళు కలపని పాలు నాక్కావాలి.

నాక్కావల్సింది నేను పొందాలి. అందుకు నాకు హక్కుంది.........

ఇలా చెప్పుకుపోతుంటే వసు ఎందుకో నవ్వుతోంది. నేనేఁవీ హాస్యంగా మాట్లాడినట్టు లేదే! ఆ మధ్య ఆయ నెవరో స్వేచ్ఛ గురించి పెద్ద కథ రాసేస్తే దాన్ని సీరియస్ గానే చదివిందే? స్వేచ్ఛ కాగితాల మీద ఉండాల్సిందే కాని బ్రతుకులో అనుభవించ తగ్గది కాదు కాబోలు! ఊఁ హుఁ. ఇవేల్టినించి స్వేచ్ఛగా బ్రతకాలంటే .... ఏడు మూడైనా, మూడు ఏడైనా!

"ఇగో, నువ్వు అలా ఇప్పుడు నవ్వడం నా కిష్టం లేదు, మరోప్పుడు నవ్వుదువ్‌గాని, ఇప్పుడు నాకు సమాధానం చెప్పు" అన్నాను.

"అంతా మీలాగ ఎనిమిది గంటలకి లేవరుకదా. చాలమందికి పొద్దున ఆరో గంటకల్లా కాఫీ కావాలి. మన కోసం ఓసారి మిగతావాళ్ళ కోసం ఓసారి రాడు పాలవాడు....

ఏ పాలవాడూ నీళ్ళు కలపని పాల మ్మడు. ఎందుకంటే వాడూ బ్రత కాలి. మనుషుల్లాగా ఆవులు, గేదెలు పిండినకొద్దీ డబ్బు రాల్చవు. వాటికి మేత వెయ్యాలి. అంచేత వాడు నాలుగు డబ్బు రాల్చుకోవాలంటే నీళ్ళు కలపడం తప్ప గత్యంతరం లేదు.... ఇలాంటి చిన్న విషయాల్లో మనం సద్దుకు పోవాల్సిందే మరి!" అని నా ప్రశ్న లన్నిటికీ సమాధానం చెప్పి చివర్ని వేదాంతంలాంటి చిన్న 'నీతి' కూడా బోధించింది.

ఎదురు చెప్పడం ఎలాగో తెలి సింది కాదు. దీని కిలా వాగడానికి హక్కెవ రిచ్చేరు?

స్వేచ్ఛ అనుభవిద్దా మనుకుంటే ఆదిలోనే హంసపాదు.........పాలవా డిష్టం వొచ్చినట్టు చేస్తాట్ట. వాడికీ స్వేచ్ఛ కావాలి. కాని, వాడి స్వేచ్ఛ

నా స్వేచ్ఛకి అడ్డం........నా స్వేచ్ఛ వాడి బ్రతుక్కి గండం........ ఓహ్హహో....

● ● ●

నాకు చలివేస్తోంది. వేణ్నీళ్ళు కావాలంటాను.

"నాకు చన్నీళ్ళ స్నానం చెయ్యాలన్లేదు. వేణ్నీళ్ల పెట్టు" అన్నాను వసుంధరతో

అంతకంటే ఏఁవన్నానని?

నా కోరిక సహజంగానేఉంది మరి!

అయినా ఎందుకో విచిత్రంగా చూసింది అర్ధాంగి.

"చన్నీళ్ళు వొంటి కారోగ్యం అని మీరే అన్నారా?"

ఉండలేక పోయేను.

"అవన్నీ నిజఁవే కాని, మరి నాకిప్పుడు వేణ్నీళ్లస్నానంచెయ్యాలనుంది"

"సర్దుకోవాలండి. అలాగనిపించినప్పుడు వెంటనే చన్నీళ్ళ స్నానం చేసేస్తే సమస్య దానంతటదే విడిపోతుంది."

"ఛీ, ఇంత చిన్న విషయంలో కూడా నా యిష్టం. ఏఁవీ లేదు. నాన్సెన్స్! వెధవ బ్రతుకు" అనిపించి, దుఃఖపడుతూనే చన్నీళ్ళ స్నానం చేసేసేను.

● ● ●

తాపీగా భోంచేయాలనే కోరికైతే


రచన:

## మరువాడ రాజేశ్వరరావు


"లేదు"

"పొదుపుచేసుకుందాం అన్నారా?"

"లేదు"

"నా జీతం రాళ్ళతో కర్రలు కూడా కాల్చలేను అన్నారా?"

"లేదు"

"ఇప్పుడన్నీ అబద్ధాలాడుతున్నారా?"

"అవునమకో, కాని:..."

పకపకా నవ్వుతోంది వసు.

ఏం చెయ్యను మరి? తన అందమైన కళ్ళతో సూటిగా నా కళ్ళల్లోంచి హృదయంలోకి చూస్తూ 'అబద్ధఁవాడుతున్నారే' అంటే నిజం చెప్పకుండా

లోపల్లోపలుంది కాని, ఓ పక్క ఆఫీసుకి టైమైపోతూ ఉండడాన్ని, ఆదరాబాదరాగా భోం చేసి బస్సు స్టాపుకి పరుగులెత్తక తప్పింది కాదు.

వెయిట్ చెయ్యాలి బస్సు కోసం.

ఎందుకు "వెయిట్" చెయ్యాలి?

నా ఇష్టం వచ్చినపుడు, నా ఇష్టం వచ్చినచోటి కెళ్ళడానికి బస్సు సిద్ధంగా ఉండాలి. అది నా కెన్నాళ్ళనుంచో ఉన్న చిన్న కోరిక. అలా జరుగుతే నా కిష్టం....కాని, అలా జరుగదు!

నేను వెళ్ళాల్సిన చోటికి వెళ్ళే బస్సొచ్చేదాకా "వెయిట్" చేస్తూ

ఉండాల్సిందే ?

కాదంటే నా మాట వినరెవ్వరూ.

"నీ ఇష్టం ఎవడిక్కావాలోయ్! వెయిట్ చెయ్యి" అంటారెవరేనా,

"వెయిట్" చేస్తూండగానే బస్సొచ్చింది.

బస్సుల్లో నిలబడాలి. కూర్చోడానికి జాగాలేదు ....

ఆఫీసులకెళ్ళేవాళ్ళు, స్కూళ్ళకెళ్ళేవాళ్ళు అంతా ఒక్కసారే ఎక్కుతారు. అందరిదీ ఒకటే సమయం.

నిలబడితే కాళ్లు పీకుతాయి. కూర్చోవాలనుంది ....

ఎవడు లేచి సీటిస్తాడు నాకోసం ? అందరికీ "స్వేచ్ఛ" ఉంది. అందరికీ ఇష్టా ఇష్టాలున్నాయి. అందరికీ కూర్చోవాలనుంటుంది.

కాని, కొందరు నుంచోవాల్సిందే.

వాళ్ళ ఇష్టానికి విరుద్ధంగా ....

వాళ్ళ "స్వేచ్ఛ"కిభంగంకలిగినా....

అదే న్యాయం. అదే ప్రజాస్వామ్యం !

బస్సు నిండా మనుషులున్నారు. కొందరు నుంచొని,కొందరు కూర్చొని.

పైన కూడా మనుషులున్నారు "వెయిట్" చేస్తూ, బస్సులోకి రావడానికి ప్రయత్నిస్తూ.

"ఇంకా ఎందర్నెక్కించేస్తావయ్యా! జాగా ఏదీ. కాలు జరుపుకోడానికిక్కూడా వీల్లేదే !" అన్నారెవరో.

"మహబాగా అడిగేర్ సార్" అనుకున్నాన్నేను.

"సర్దుకోవాలి సార్, సర్దుకోండి. అదుగో వాళ్ళిద్దరి మధ్యా చిన్న ఖాళీ ఉంటుంది. మీరందులోకి సర్దుకోండి. అలా పక్కకి సర్దుకోవయ్యా ముసిలోడా అలా నావేపు సూస్తావేటి .... ఒరే కుర్రనాకొడకా, అదుగో ఆ బాబుగారిరెండుకాళ్ళమధ్యాదూరిపో.... అదుగో ఖాళీ అయింది సార్, అందులోకి సర్దుకోండి .... రైట్ !"

బస్సు కదిలింది. బస్సులో జనం క్రిక్కిరిసి పోయేరు. ఉక్కపోస్తోంది.. పక్కవాడి చేతి చెమట నా చొక్కాకి అంటుకుపోతోంది. వెధవకంపు కొడుతున్నా దెక్కడ్నించో, యెవడి నోట్లోంచో ....

ఛీ, బాగులేదు.

ఎవడిష్టపడతాడిలా ప్రయాణం చెయ్యడానికి ? స్వేచ్ఛగల ఏ మానవుడీ బస్సెక్కుతాడు ?

నాకు స్వేచ్ఛ కావాలి.

ఈ బస్సులో వాళ్ళందరికీ స్వేచ్ఛ కావాలి.

ఇందులో ఎవరికీ ఇలా ప్రయాణం చెయ్యడం ఇష్టం ఉండదు. అయినా ప్రయాణం చేసేస్తున్నారు. తమ ఇష్టాన్ని చంపుకొని, స్వేచ్ఛని మర్చిపోయి ....

● ● ●

ఇది నా ఆఫీసు.

ఈ ఆఫీసులో పని చెయ్యడం సుతరాము నా కిష్టం లేదు. అయినా ఈ ఉద్యోగం వొచ్చిందని తెలిసిన్నాడు

ఎంత సంతోషించేను.

మరెక్కడా ఉద్యోగం రా లే దు. ఇక్కడే వొచ్చింది. మరెక్కడా రాక పోయినా ఇక్కడొచ్చినందును సంతోషించేను. అంతేగాని ఇక్కడొచ్చినందుకు మాత్రం కాదు.

అదుగో, నా టైపుమిషను ....

దానికీ, నాకూ ఈ ఉద్యోగం వొచ్చిన్నాటి నుంచీ దోస్తి. ఎన్ని కాగితాలు దానిమీద "టైపు" చేసేనో లెక్కలేదు.

అయినా ఈమిషనంటేనాకిష్టంలేదు.

ఆ మూల కూర్చొని కాగితాల కొక్కాగితాలు టైపు చేసేస్తూంటే, "టక టక "మంటూ అది పేల్తుంటే .... వినలేను, భరించలేను.

వినడం భరించడం నా విధి.

అది వినడం, భరించటం నా కిష్టం లేదు.

ఆ "టైపు మిషన్ని" అవతల విసిరేయాలనిపిస్తుంది. నాకు "స్వేచ్ఛ" ఉంటే అంతపని చేసేదును.

ఆఫీసుకి రాగానే 'అర్జెంట్ మేటర్' టైపు చెయ్యమన్న ఆఫీసర్ని చంపేయాలనిపించింది. అది చేత కాదు కనక నాకు చచ్చిపోవాలనిపించింది.

ఓ పావుగంటసేపు తాపీగా విశ్రమించి, విలాసంగా, కులాసాగా బుద్ధి పుట్టినప్పుడు ఒకో అక్షరం టైపు కొట్టాలనుంటుంది నాకు.

అర్జెంటు అర్జెంటు!

వెంటనే గబగబా టైపు కొట్టేసి ఆ కాగితాలు పంపించేస్తే వెంటనే మరో కట్ట కాగితాలు సిద్ధమౌతాయి.

స్వేచ్ఛ లేదు. ఒకడి అధికారానికి లోబడాలి. మరోడి ముందు వొంగి నడవాలి. వొంగి, వొంగి సలాములు, నమస్కారాలు పెట్టాలి, ఇష్టం లేక పోయినా ఇంకోడ్ని పొగడాలి. ఇష్టం ఉన్నవాళ్ళతో కూడా ముభావంగా మాట్లాడాలి. లేకపోతే కొందరికోపం వస్తుంది.

అబ్బబ్బ! నాకు స్వేచ్ఛ లేదు.

ఏమైపోయింది నా స్వేచ్ఛ?

పుట్టుకతో ప్రకృతి నా కిచ్చిన స్వేచ్ఛ ఏమైపోయింది?

అమ్మేసుకున్నాను.

కావాలని కొనుక్కున్నాను బానిసత్వం.

ఇవన్నీ వొద్దంటే, ఇవన్నీ వొదిలేసుకుంటానంటే, అడవుల్లోకి పారిపోయి స్వేచ్ఛగా ఆడుకుంటానంటే ఎవరూ వొద్దనరు. నేనే వొద్దనుకున్నాను. ఎందుకోసమో స్వేచ్ఛ వొదులుకున్నాను.

దేని కోసం స్వేచ్ఛ వొదులుకున్నాను?

దేని కోసం ఈ బానిసత్వాన్ని కొనుక్కున్నాను?

"ఈ కాయితాలు బేగి టైపుచేసిచ్చీమన్నారండి"

నిన్ను ఛావమన్లేదూ? ఒహ్.... వెధవ బతుకు.

వెయిట్ చెయ్యండి! వెయిట్ ??

ఆగండి! ఆగండి!!
తప్పుకోండి! తప్పుకోండి!!
సర్దుకోండి! సర్దుకోండి!!
నా మాట వినండి!
నే చెప్పినట్టు చెయ్యండి!
నావేపు కూడా ఓసారి చూడండి!
నా గురించి కూడా ఒసారి ఆలోచించండి!

"ఇద్దరూ జీవితాంతం కలిసి ఉండండి.

పిల్లల్ని పోషించి, పెద్ద వాళ్ళని చెయ్యండి!"

డ్యూటీ! డ్యూటీ!!
బాధ్యత.... బాధ్యత!
సంఘం, సంఘం!

"అబ్బబ్బ! వెధవ గోల"

"ఏంవిటండోయ్, ఎక్కడ గోల?" అని నవ్వుతూ అడిగేడు పక్కసీటులోని సుధాకరం. నిశ్శబ్దంగా ఉన్న ఆఫీసులో టైపు మిషను చప్పుడొక్కటే వినిపిస్తోంది. మరేగోలా లేదు.

"ఏవో ఆలోచన్లు లెండి" అంటూ నవ్వేసి ఊరుకున్నాను.

మేటరంతా టైపుచేసి పంపించేసేక సుధాకరంతో మాటవరసకన్నట్టు, "స్వేచ్ఛ లేదండీ! ఏ పని చెయ్యడానికీను!" అన్నాను.

అతను కాస్సేపాలోచించి.

"కడుపుకి తిండి, కట్టడానికి బట్ట, సుఖం, రక్షణ — ఎప్పుడైతే మనిషి క్కావల్సొచ్చేయో అప్పుడే స్వేచ్ఛ పంజరంలో చిలకైంది సార్. కాని, మరో విషయం. మనం సమాజాన్ననుసరించి నడుస్తున్నాం. అలా నడవడం వల్ల సమాజం మనకి కావల్సిన అవసరాలంద జేస్తోంది. అంటే, మన నడవడికని, మన అవసరాల్ని నిర్ణయిస్తోంది. సమాజంలోని వ్యక్తులకి లేకపోయినా, సమాజం మొత్తానికి స్వేచ్ఛ ఉందన్నమాట!" 'అద్గదీ సంగతి' అన్నట్టు మొహం పెట్టి ఉపన్యాసం ముగించేడు.

సుధాకరం చెప్పిందాని కెప్పుడూ సవరణలు ప్రతిపాదించడం రాంబాబు కలవాటు. ఆ అలవాటు ప్రకారం, "అదికాదు సార్! సమాజం అంటే ఎవరు? మనుషులే కద! మనుషులంటే ఎవరు: మనంవే కద! అంటే మనం స్వేచ్ఛని కొంత తగ్గించేసుకుని నలుగురితోటీ సర్దుకుపోతూంటే మనందరికీ తిండి, సుఖం. రక్షణ అనేవి లభిస్తాయి"

"అందరికీ తిండి, సుఖం ఏ:0డీ? ఆఫీసుల్లోను, మెయిన్ రోడ్డుమీదా కాదు. కొంచెం ఆ సందుల్లో కూడా వెళ్ళి చూడండి. ఆ సర్దుబాటనేదెలాగుందో?" రంగణ మధ్యలో అందుకున్నాడు.

"అదేనయ్యా నే చెప్పబోయేదీను! సమాజంలోని మనుషులందరూ సుఖంగా, సమానంగా ఉండడం. అంటే ఏ కొందరికో అన్నీ ఉండి మిగతావాళ్ళకి ఏదీలేనట్టు కాకుండా ఉన్నదేదో అందరూ సమానంగా

పంచుకోవడం, అందరూ అన్నదమ్ముల్లా కలిసుండడం. మనం అందరమూ కోరుకునేదేకద! ఆ ఫలితాన్నిచ్చే విధంగా సమాజంలోని మనుషులంతా సర్దుబాటు చేసుకుంటే .... అప్పుడే మనందరికీ, అంటే....సమాజానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది" అన్నాడు రాంబాబు.

ఇంతలో గడియారం అయిదు గంటలు కొట్టింది.

● ● ●

కొంచెం హాయిగా ఊపిరి పీలుస్తూ మెయిన్ రోడ్డుమీద నడుస్తున్నాను.

"బాబూ, పైసా ధర్మం చెయ్యండి" అని అరుస్తున్నాడో ముష్టివాడు.

నా పక్కనించే దూసుకుపోతున్న హెరాల్డు కారులో గ్లాస్కో పంచె, నల్ల కళ్ళద్దాలు, స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్టు ఉన్న పెద్దమనిషి.

అతని వెనకనే చెమటలు కక్కుతూ, రిక్షా లాగుతున్న వ్యక్తి కాళ్ళీడ్చుకుంటూ, కండలు పిండుకుంటూ నడుస్తున్నాడు.

ఆ రిక్షాలో తరిగిపోతున్న అందానికి అలంకారాలు మెరుగులు దిద్దుకొని వొళ్ళమ్ముకోడానికి సిద్ధమైన వేశ్య.

రోడ్డు పక్క దుకాణాల్లో కొత్త పన్నులవల్ల వేల సంఖ్యలో వచ్చే లాభాలకి వందల సంఖ్యలో రాబోయే నష్టాన్ని ఎవరిమీద రుద్దేయాలా అని ఆలోచిస్తున్న షావుకారు.

అమెరికా నుండి దిగబడిన టెర్లిన్ జుతలో, హెయిరాయిల్స్, స్నో, పౌడర్లు తెచ్చిన ఆకర్షణతో ధీమాగా నడుస్తున్నాడో కేప్‌స్టన్ సిగరెట్టు.

బొత్తాములూడిపోయిన పంట్లాన్ని ముడివేసుకొని, బాగా మాసిన తెల్లచొక్కా వేసుకుని, చెదిరిన జుత్తుతో, మాసిన గడ్డంతో కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న చార్మినార్ సిగరెట్టు.

డబ్బుతోపాటొచ్చిన గర్వం, అహంకారం విద్యావంతురాలయేక తగ్గాల్సినా, ఎంచేతనో ద్విగుణీకృతమైన వంకర నడకల టెర్లిన్ చీర.

డబ్బు, చదువు, సంస్కారం లేక, అజ్ఞానాంధకారపు బ్రతుకులో, సంకుచితత్వాల బూజులో అసూయ, దురాశ, ద్వేషం పెంచుకొంటున్న, చీకటౌతున్న గదిలోంచి వీధిలోకి నీరసంగా, నిరుత్సాహంగా చూస్తున్న మాసిన, చిరుగులు పట్టిన చీర... వీళ్ళెవరికీ స్వేచ్ఛ లేదు, వీళ్ళనిశాసిస్తున్నసమాజానికి?....

ఇదీ వ్యవస్థ.

ఇదీ నాగరికత.

ఇదీ సర్దుబాటు.

ఏదీ మానవత్వం ?

ఏదీ ? ఏదీ ? .... ఎక్కడ ? ఎలాగ ? ఎప్పుడు ?

పడమటి దిక్కున, సూర్యుడస్తమించిన చోట, సంజకెంజాయ రంగు పులుముకున్న ఆకాశంవేపు చూసేను ఆశగా ?

●●●

జ్యోతి